## క్లుప్తంగా

### సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



**అలంపూర్:** సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. ఎవరైనా సైబర్ వలలో చిక్కితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. అలంపూర్ పట్టణానికి చెందిన నరేందర్‌రెడ్డి, గొందిమళ్లకు చెందిన అయ్యస్వామి సైబర్ బారినపడి డబ్బులు పోగొట్టుకున్నట్లు తెలిపారు. వారు తక్షణమే సైబర్ క్రైం పోర్టల్ 1930కి ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు బాధితులు పోగొట్టుకున్న డబ్బులను పుట్ ఆన్ హోల్డ్ చేసినట్లు పేర్కొన్నారు. గద్వాల డీఎల్ఎస్ఏ కోర్టు ద్వారా పోగొట్టుకున్న డబ్బులకు సంబంధించిన రిఫండ్ ఆర్డర్ శనివారం ఇప్పించామని తెలిపారు.

### ఫొటో ఎక్స్‌పో పోస్టర్ల విడుదల



**శాంతినగర్:** హైదరాబాద్‌లోని హోం కన్వెన్షన్ నార్సింగిలో ఈ నెల 19న నిర్వహించే ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను శాంతినగర్‌లో శనివారం విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ టాటా బాబు, ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి హాజరై పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సీనియర్ ఫొటోగ్రాఫర్లు ఒకే ఒక్కడు, అధ్యక్షుడు శాంతిరాజు, కొంకల రామకృష్ణ, వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

### బ్రిడ్జికి మరమ్మతు



**అయిజ:** పట్టణ సమీపంలోని రాయిచూరు–కర్నూలు అంతర్రాష్ట్ర రహదారిపై అయిజ సమీపంలో శిథిలమైన బ్రిడ్జిపై శనివారం రంధ్రం పడింది. దానితో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్ఐ శ్రీనివాసరావు అక్కడకు చేరుకొని యంత్రాలతో రంధ్రం పూడ్చి వేయించారు. వంతెనకు మరమ్మతు చేయించి రాకపోకలు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పోలీసులను పలువురు అభినందించారు.

### స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



**ధరూరు:** అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన పదో తరగతి స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థికసాయం అందించారు. మూడు రోజుల క్రితం మండలంలోని గార్లపాడుకు చెందిన శ్రీనివాస్ మృతి చెందాడు. ఉప్పేరు ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న తమ మిత్రుడు చనియాడన్న వార్త తెలుసుకుని శనివారం మిత్రులంతా కలిసి పోగు చేసిన రూ.40 వేలను పెద్ద కుమార్తె దీపిక పేరు మీద పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో రవి కుమార్, నర్సింహులు, ప్రభు, బ్రహ్మచారి, గోవిందు, నారాయణ, కురుమూర్తి, రంగస్వామి పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**అమరచింత:** రాజ్యాంగం ప్రజలకు కల్పించిన చట్టాలపై ప్రతి విద్యార్థిని అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ స్వాతి అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులోని కేజీబీవీలో శనివారం వందేమాతరం ఫౌండేషన్ ద్వారా అక్షరజ్యోతి కార్యక్రమంలో భాగంగా గ్రామసభలో పాల్గొని విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గురుకులాలు, కేజీబీవీలలో చదువుకుంటున్న వారికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ స్వప్నరాణి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ తీగల ఏర్పాటు

**అమరచింత:** కొత్తగా ఏర్పాటు చేసిన సిమెంట్ విద్యుత్ స్తంభానికి విద్యుత్ తీగలను శనివారం ట్రాన్స్‌కో అధికారులు శనివారం బిగించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ రహదారిలో ఒరిగిన విద్యుత్ స్తంభం తొలగించిన ట్రాన్స్‌కో అధికారులు వాటి స్థానంలో సిమెంట్ స్తంభంను మూడు రోజుల కిందట ఏర్పాటు చేశారు.

# వైద్య సేవలు మెరుగు



రాజోళి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం

- రాజోళి పీహెచ్‌సీలో అందుబాటులో నిరంతర వైద్యం
- సరిహద్దు గ్రామాలకు సరైన సమయంలో సేవలు
- కుక్క కాటు నుంచి ప్రసవాల వరకు చికిత్స



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మధుబాబు

**రాజోళి:** నేను రాను సర్కార్ దవాఖానా అనే స్థాయి నుంచి 'నేను పోత రాజోళి పీహెచ్‌సీ' అనేంతలా వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. పేరుకు 12 గంటల ఆస్పత్రే అయినా సరిహద్దు గ్రామాల వారికి సరైన సమయంలో వైద్యం అందిస్తూ రాజోళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజల మన్ననలను పొందుతుంది. పదేళ్ల క్రితం ఆస్పత్రి సేవలు ప్రారంభమైనప్పటికీ.. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరి వసతులు లేకపోవడంతో సాధారణ సేవలు మాత్రమే అందేవి. దీంతో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల వారు వైద్యం కోసం శాంతినగర్, కర్నూల్‌కు పరుగులు తీసేవారు.

**అందుబాటులో వైద్యం**

రాజోళి పీహెచ్‌సీ ప్రతిపాదన సమయంలో కేవలం 12 గంటల ఆస్పత్రిగానే మంజూరయింది. ఆస్పత్రిలో నూతన హంగులతో సౌకర్యాలు మెరుగుపర్చుతూ రోగులకు ఎన్నో సేవలు అందుబాటులోకి తెచ్చారు. సరిహద్దులో ఉండటంతో ఎక్కువగా కర్నూల్‌కు వెళ్లే రోగులు కూడా ఇప్పుడు మెరుగైన వైద్యం అందుతుండడంతో రాజోళి పీహెచ్‌సీలోనే వైద్యులను సంప్రదిస్తున్నారు. ఈ పీహెచ్‌సీ కింద 6 సబ్ సెంటర్లు ఉండగా.. 8 మంది ఏఎన్ఎంలు, పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ఫార్మాసిస్టు ఉన్నారు. వీరే కాక టీబీ సూపర్వైజర్లు, ఇతర పర్యవేక్షకులు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. టీబీపై అవగాహన, సీజనల్ వ్యాధులపై క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. కుక్క, పాము కాటుతో పాటు ప్రసవాలు కూడా చేస్తుండటంతో మండల ప్రజలు ఆస్పత్రి సేవలు వినియోగించుకుంటున్నారు. కరోనా సమయంలో కూడా సిబ్బంది ముందు వరుసలో నిలబడి కోవిడ్ పరీక్షలు, వ్యాక్సిన్లు అందించారు. ఇంతటి సేవలు అందిస్తున్న ఆస్పత్రిని 24 గంటల ఆస్పత్రిగా మార్చి అదనపు సిబ్బందిని కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**వసతులు లేక సిబ్బంది రాక..**

భవనం నిర్మించినప్పటికీ పై కప్పు పెచ్చులూడిపోయి, కిటికీలు, తలుపులు పగిలిపోయి, ఫర్నీచర్ ధ్వంసం కావడంతో భవనాన్ని అలాగే వదిలేశారు. దీనికి తోడు సిబ్బంది కేటాయింపు కూడా జరగలేదు. 2016లో అప్పటి కలెక్టర్ చొరవతో ఆస్పత్రి అభివృద్ధికి పునాది పడింది. రూ.10 లక్షలతో ఆస్పత్రి మరమ్మతు చేపట్టగా.. దానికి అదనంగా రాజోళి గ్రామ పంచాయతీ నిధుల నుంచి అప్పటి సర్పంచ్ మార్లబీడు వెంకటేశ్వరమ్మ రూ.5 లక్షల కేటాయించారు. దీంతో వసతులు పెరిగి ఆస్పత్రిలో సేవలు ప్రారంభమయ్యాయి.

**సరైన సమయానికి..**



రాజోళి పీహెచ్‌సీ ప్రారంభం కాకముందు వైద్యానికి చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కర్నూల్, శాంతిగనర్‌కు వెళ్లి ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.వేలు ఖర్చు చేసి వైద్యం చేయించుకునేవాళ్లం. రాజోళి పీహెచ్‌సీ ప్రారంభం అయ్యాక అత్యవసర సమయంలో కూడా వైద్యం అందుతుంది. కుక్క, పాము కాటుకు సైతం మందులు ఇస్తున్నారు. ప్రసవాలు కూడా చేస్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది.

– పరమేష్ గౌడ్, పెద్దధన్వాడ

**కలెక్టర్ చొరవతో..**

రాజోళిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం భవనం నిర్మించినప్పటికీ అది శిథిలావస్థకు చేరడంతో ఆస్పత్రి ప్రారంభం కాలేదు. అప్పటి కలెక్టర్ శశాంక్ చొరవతో ఆస్పత్రిలో అభివృద్ధి పనులు ముందుకు కదిలాయి. ఆయన రూ.10 లక్షలు కేటాయించగా.. గ్రామ పంచాయతీ నుంచి రూ.5 లక్షలతో అదనంగా మరిన్ని వసతులు కల్పించాం. దీంతో సిబ్బందిని కేటాయించారు. ప్రస్తుతం 24 గంటలు నిరంతరాయంగా వైద్యం అందుతుంది.

– మార్లబీడు వెంకటేశ్వరమ్మ, మాజీ సర్పంచ్,రాజోళి

**ఓపీల సంఖ్య వెయ్యి దాటుతుంది**

రాజోళి పీహెచ్‌సీలో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జూన్‌లో 1,713, జూలైలో 1,734, ఆగస్టులో 1,738 మంది రోగులు పీహెచ్‌సీలో ఓపీ తీసుకున్నారు. ప్రసవాలు కూడా ఇక్కడే చేస్తున్నాం. గ్రామాల నుంచి రెగ్యులర్ చెకప్‌ల కోసం మహిళలు, గర్భిణులు వస్తున్నారు. ఆస్పత్రిలో ఉన్న సేవలను తెలియచేసేందుకు తప్పకుండా గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ మధుబాబు, మెడికల్ ఆఫీసర్, రాజోళి పీహెచ్‌సీ

## వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజనం ఆరగిస్తున్న వార్డెన్, తల్లిదండ్రులు

**శాంతినగర్:** హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని హాస్టల్ వార్డెన్ హేమచంద్రరావు విద్యార్థులకు సూచించారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురం ఎస్సీ హాస్టల్‌లో వార్డెన్ అధ్యక్షతన శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు పెడుతున్న భోజనం, సౌకర్యాలు, ప్రభుత్వం నుంచి అందుతున్న సౌకర్యాలు, వైద్య పరీక్షల గురించి వివరించారు. పది విద్యార్థులకు ట్యూటర్లను నియమించి ప్రత్యేక బోధనతో పాటు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్, పెన్నులతో పాటు ఎగ్జామ్ ప్యాడ్‌లు, స్టడీ మెటీరియల్, వర్క్ బుక్స్ తదితర మెటీరియల్ అందజేస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ నాణ్యమైన భోజనం వండిపెట్టాలని, పిల్లలు అనారోగ్యాలకు గురవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వార్డెన్‌కు సూచించారు. అలాంటి సమస్య తలెత్తకుండా చూస్తానని వార్డెన్ వారికి హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి వార్డెన్ భోజనం ఆరగించారు.

## వంతెనపై కారు చీకట్లు



బ్రిడ్జిపై నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

**అయిజ:** పట్టణంలో పెద్దవాగుపై నూతనంగా నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిపై విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రతిరోజు రాత్రి కారు చీకట్లు కమ్ముంకుంటున్నాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. శనివారం బ్రిడ్జిపై బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాత్రి సమయంలో అనేక వాహనాలు ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నాయని మండిపడ్డారు. ముఖ్యంగా మహిళలు వంతెనపై వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, నాగరాజు, మను రెడ్డి, వీరేష్, భాస్కర్‌రెడ్డి, తిరుమలేష్, కృష్ణ, బద్రి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ కమిటీల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

**శాంతినగర్:** విశ్వహిందూ పరిషత్ ప్రఖండ మండల, పట్టణ కమిటీలను ఆ సంఘం నాయకులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శ్రీసీతారాముల వారి ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. శాంతినగర్ ప్రఖండ మూడు మండలాలు (రాజోళి, వడ్డేపల్లి, మానవపాడు) సంబంధించిన కమిటీ అధ్యక్షులుగా పైపాడుకు చెందిన ప్రేమ్‌కుమార్, కార్యదర్శిగా మహేష్, సహాయ కార్యదర్శులుగా పైపాడు భాస్కర్, నరేష్‌గౌడ్, వడ్డేపల్లి మండల అధ్యక్షుడిగా జిల్లెడుదిన్నె వెంకటేశ్వర్‌రెడ్డి, శాంతినగర్ పట్టణ అధ్యక్షుడిగా బంగారు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా విజయమోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జితూరి రమేష్, కార్యదర్శిగా ఆర్ఎంపీ రమేష్, భజరంగ్‌దళ్ ప్రముఖగా విజయ్‌యాదవ్, సత్సంగ్ ప్రముఖగా రామచంద్రుడిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పనిమోహన్‌రావు, ఉపాధ్యక్షులు గాయత్రి శ్రీనివాసులు, మాణిక్యం వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలాక్షేత్రం



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

**మల్దకల్:** ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావుల చెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, వాల్మీకి పూజారులు తిమ్మప్ప, నర్సింహులు, ఆలయ సిబ్బంది రంగనాథ్, ఉరుకుందు, కృష్ణ, శివమ్మ, రాము, శ్రీను, చక్రి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఎర్రవల్లి:** మండల కేంద్రంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ శేఖర్ శనివారం తెలిపారు. ఎర్రవల్లి ఫీడర్‌లో విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగిలి అంతరాయం కలిగించే చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన సూచించారు.

**గట్టు:** స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏడీఈ గోవింద్, ఏఈ చిన్నయ్య తెలిపారు. గట్టులోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని గట్టు, రాయాపురం, గంగిమాన్‌దొడ్డి, తారాపురం, సల్కాపురం, యల్లందొడ్డి గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## బీఆర్ఎస్ గద్వాల గర్జన సక్సెస్



కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న బీఎస్ కేశవ్

**గద్వాల న్యూటౌన్:** జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గద్వాల గర్జన సభ విజయవంతం అయిందని నాయకులు తెలిపారు. ఎర్రవల్లి చౌరస్తా నుంచి భారీ కాన్వాయ్‌తో శ్రేణులు కేటీఆర్‌తో వెంట వచ్చారు. సభలో మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో పాటు మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఎస్ కేశవ్ మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయడానికి సైనికుడిలా పనిచేస్తానన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ చెప్పినందునే ఎమ్మెల్యేను గెలిపించామని తెలిపారు. ఇక నుంచి పార్టీ కార్యకర్తలతో కలిసి అన్ని శక్తులను ఎదుర్కొంటామన్నారు. చివరి శ్వాస వరకు కేటీఆర్ నాయకత్వంలో పనిచేస్తానని స్పష్టం చేశారు. అనంతరం శాప్ మాజీ చైర్మన్ ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ గద్వాలలో అల్లుడు స్వాతిముత్యం.. అత్త ఆణిముత్యంలా వ్యవహరిస్తూ కొత్త నాటకం ఆడుతున్నారని విమర్శించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు మాట్లాడుతూ.. సభ జరగకుండా అధికార పార్టీ నాయకులు అనేక అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. అయినా వేలాదిగా జనం తరలివచ్చి సభను విజయవంతం చేశారన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**ఉండవెల్లి:** మండలంలోని బొంకూరు గ్రామానికి చెందిన అలంపూర్ ఆలయ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి తల్లి ప్రమీలమ్మ మృతిపై ఎమ్మెల్యే విజయుడు సంతాపం తెలిపి, భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే అబ్రహం పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లిలో కేటీఆర్‌కు ఘన స్వాగతం



ధరూరులో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న రఘువర్ధన్‌రెడ్డి

**ఎర్రవల్లి:** మండల కేంద్రంలోని జాతీయ రహదారి కూడలిలో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుకు బీఆర్ఎస్ నేతలు శనివారం ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ గర్జన బహిరంగ సభకు మాజీ మంత్రి కేటీఆర్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డితో కలిసి వెళ్తుండగా శ్రేణులు కూడలిలో పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించి గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నారాయణనాయుడు, సుదర్శన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, హనుమంతురెడ్డి, శేఖర్‌గౌడ్, నర్సింహారెడ్డి, పల్లెరాజు, కృష్ణసాగర్, రాఘన్న, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

**అయిజ:** జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన కేటీఆర్ సభకు అయిజ మండలం నుంచి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంకాపురం రాముడు ఆధ్వర్యంలో 13 వాహనాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు.

**గట్టు:** మండల కేంద్రంతో పాటు మాచర్ల, బల్గెర, యల్లందొడ్డి, గంగిమాన్‌దొడ్డికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ప్రత్యేక వాహనాల్లో గద్వాలకు తరలి వెళ్లారు.

**ధరూరు:** మండలంలోని ఆయా గ్రామాల నుంచి బైక్‌లు, ప్రత్యేక వాహనాల్లో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. రఘువర్ధన్‌రెడ్డి, రాజారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌నాయుడు, అబ్రహం, సీతారాములు, నీలమ్మ గారి తిమ్మన్న, ప్రతాప్, భరత్, తదితరులు ఉన్నారు.

## రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

**ధరూరు:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 15 నుంచి ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలను నిర్వహించనున్నట్లు ఎంఈఓ రవీంద్రబాబు తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్–14, అండర్ –17 విభాగాల్లో బాల బాలికలను ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించి, ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 1, 2012 తర్వాత పుట్టిన విద్యార్థులు అర్హులని, అండర్– 17 విభాగంలో పాల్గొనే విద్యార్థులు జనవరి 1, 2009 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. అర్హులు ఆధార్ జిరాక్స్ తీసుకుని వచ్చి పీడీ శ్రీనివాసులును 9.30 గంటల లోపు రిపోర్ట్ చేసుకోవాలన్నారు.

## మల్దకల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



పూజల్లో పాల్గొన్న సీఐ టంగుటూరు శ్రీను

**మల్దకల్:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శనివారం గద్వాల సీఐ టంగుటూరు శ్రీను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ వివిధ కేసుల నిమిత్తం పోలీస్‌స్టేషన్ వచ్చే బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నందికర్, ఏఎస్ఐ ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి గాలికి వదిలారు



ఉత్తనూరులో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి



గట్టులో..

**సాక్షి, నెట్‌వర్క్:** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధిని గాలికొదిలేసిందని బీజేపీ నాయకులు దుయ్యబట్టారు. శనివారం జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యల గురించి ఆరా తీశారు. అధిక వర్షాల కారణంగా దోమల ఉధృతి పెరిగి మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాల బారిన ప్రజలు, పంటలు నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

- వడ్డేపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించి, సెప్టెంబర్ 17న ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని సేవాపక్వాడ్ కార్యక్రమం నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని కోయిల్‌దిన్నె, రామాపురం, జూలెకల్, తనగల గ్రామాల రోడ్లు అధ్వాన్నంగా మారి ప్రయాణానికి నరకంగా మారాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటేశ్వర్లు, పరశురాముడు, అయ్యరాజు, రాఘవేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.
- శాంతినగర్ మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో సేవా పక్షం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వడ్డేపల్లి పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, పట్టణ ఉపాధ్యక్షుడు మోహన్, రాజశేఖర్, రవి, శేఖర్, పరుశ, హుస్సేన్, బీరప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.
- ఇటిక్యాల మండలంలోని ఉదండాపురంలో బీజేపీ మండల అధ్యక్షుడు షేక్ అబ్దులా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి స్వప్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామాల్లో రక్తదానం, స్వచ్ఛ భారత్, దివ్యాంగులు, మేధావులకు సన్మానం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మారెడ్డి, షాలు, వీరన్న, వెంకటేష్, పరశు, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.
- అయిజ మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. అఖిలపక్ష కమిటీ నాయకులు గాజులపేట, మడ్డింగుత కాలనీ, తెలుగుపేట, దుర్గానగర్, సంతబజార్, తుపత్రాల, పులికల్, మేడికొండ, ఉత్తనూరు గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, తాహేర్, జగపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- గట్టులో బీజేపీ మండల అధ్యక్షుడు గుడూరు నాగప్ప ఆధ్వర్యంలో సేవా పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బల్గెర శివారెడ్డి, మాచర్ల సురేష్, నర్సింహాగౌడ్, వీరశేఖర్‌గౌడ్, మొద్దు సంజీవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో కేసుల రాజీ



**ధరూరు:** జిల్లా కేంద్రంలోని కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పలు పెండింగ్ కేసులను రాజీ చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన పలు కేసులను ఇరు వర్గాలను ఒప్పించి రాజీ చేయించామన్నారు.